క థా ని క :

# సూటిప్రశ్న

(వంగమాతృక ననుసరించి)

"అమరేంద్ర"



నిషా బాగా తలకెక్కినాక కొంచెంసేపు మౌనంగా కూచుని అశోక్ ఒక కూని రాగం అందుకుని "నాకు సంగీతం వినాలని వుంది" అన్నాడు.

[illegible] స్నేహితుడు విలాసుడు "అయితే టాక్సీ పిలూ. డబ్బు నే నిస్తాలే" అని జేబులోంచి కవిగా ఒక నోట్ల బొత్తెక తీసి బల్లమీద పడేశాడు.

"ఛ ఛేమాట. నువ్విస్తావూ? అశోక్ లాంటి మేరుపర్వతం దగ్గరవుంటే నువ్విచ్చేదేమిటి? ఎవరైనా నవ్విపోతారు" అన్నాడు ఇంకో నిషాభాయి అమల్. కోపంగా అశోక్ బల్లమీద చేత్తో చరిచి "ముందు టాక్సీ పిలూ. సూటిగా రాణీయింటికి పోదాం పదండి" అన్నాడు.

అప్పటికే మస్తుగా ముస్తాబుచేసుకుని రాణి ఎదురుచూస్తూవుంది. ఆమె కంటపడగానే అమల్ ఒకసారి ఎగాదిగా చూసి "పసందుగా వున్నావ్ రాణీ" అన్నాడు. రాణి ఒక చిరునవ్వు మెరిపించి అందరినీ కూచోమని అన్నది.

"నీపాట వినాలని వచ్చాం రాణీ" అన్నాడు వినోద్.

"ఏం పాట పాడమంటారో సెలవివ్వండి" అంది రాణి.

అమల్ అడ్డంవచ్చి "ఏదో ఒకటి నీకు తోచిన పాట. విరహాన్ని గురించో, సమాగమాన్ని గురించో, ప్రణయకలహాన్ని గురించో ఏదైనా సరే పాడు." అన్నాడు.

అమల్ స్థితి చూసి రాణి నవ్వు ఆపుకోలేకపోయింది. ఇంకోళ్లచేత డబ్బు ఖర్చు పెట్టించి తను సీసాలమీద సీసాలు ఖాళీచేసి పారెయ్యటంలో అతను మొనగాడు!

"అలసింప కో ప్రియా! నిలువలేోయి రేయి" అని అందుకుంది రాణి. పాటతరవాత పాట, ఎన్నో తీయని పాటలు పాడింది రాణి. కొంతసేపటికి అమల్ దివాన్మీద పడిపోయి గుర్రుపెట్టటం మొదలుపెట్టాడు. వినోద్ కింద పడిపోలేదుకాని అతని తల మాత్రం అతనికి తెలియకుండా పాటకి తాళం వేస్తున్నట్టు వూగిపోతోంది.

బైట వాన కురుస్తూనేవుంది. మూసివున్న గాజుకిటికీతలుపుల్లోంచి అస్పష్టంగా వున్న దృశ్యాలని అశోక్ చూస్తూకూచున్నాడు. మాట్లాడాలంటే వెగిలిరావటం లేదు. మునుపటిలాగా ఖులాసాగా మాట్లాడకుండా ఏదో సంకోచం అతన్ని అడ్డగిస్తోంది.

రాణి పాట ఆపేసి అశోక్ చెయ్యి పుచ్చుకుని "మాటు" అని చెప్పి గదిబైటికి తీసుకువెళ్లింది. అశోక్ బైటికి వచ్చి వసారాలో పిట్టగోడకి ఆనుకుని రాణిముఖంకేసి చూస్తూనిలబడ్డాడు.

అతనితో కొన్ని పరుషమైన సంగతులు మాట్లాడాలని రాణి అశోక్ చెయ్యి గట్టిగా పట్టుకుని బైటికి తీసుకువచ్చింది. కాని మత్తు పూర్తిగా వొదలని అతని ముఖంకేసి చూసేసరికి ఆమెకి నోరు రాలేదు.

కొంచెంసేపున్నాక అశోక్ "ఎందుకు నన్నిక్కడికి పిలుచుకొచ్చావ్? ఏమిటి సంగతి?" అని కరుకుగా అడిగాడు. రాణి అతని కరుకుప్రశ్న విని ఒకసారి అతనికేసి చురుకుగా చూసి, నిట్టూర్పు విడిచింది. "నాలుగురోజుల్నుంచి దర్శనమే లేదే?" అని అడిగింది.

"రావటంలేదు" అన్నాడు అశోక్.

"శోభకి ఎక్కువగా వుందా? అదుర్దా ఏం లేదుకదా?" అని రాణి అడిగింది.

"ఆందోళన ఏమీ అవసరం లేదు"

"అయితే ఇప్పుడే వెళ్ళిపోతారా ?"

అశోక్ రిస్టువాచ్‌కేసి చూసి "అవును వెళ్లాలి. అదుగో అప్పుడే తొమ్మిది అవుతోంది" అన్నాడు.

"అయితే వెళ్లండి" అని రాణి అతని చెయ్యి వదిలేసింది. చిరునవ్వుతో తన గదికేసి వేలుతో చూపిస్తూ "మరి వాళ్లని ఏం చేస్తారు ?" అంది.

"నిజమే. ఇదొక సమస్యే" అని అశోక్ నవ్వాడు.

"ఈ నిషాలో వాళ్లని ఇక్కణ్ణుంచి ఎల్లా తీసికెళ్తారు ?"

"నాకు తోచటం లేదు. ఏం చెయ్యను?" అన్నాడు అశోక్.

"నే నేం చెయ్యను ?" అంది రాణి.

"అక్కడే వుండనీ"

"అమ్మ బాబోయ్. ఇంకేమైనా వుందా?" అని భయంతో అరిచింది రాణి. అశోక్ రాణిచేతులు పుచ్చుకొని దగ్గరికి లాక్కుని "ఒక్కరాత్రేగా, వాళ్లని వుండ నియ్యరాదూ?" అన్నాడు.

"మీరు వెళ్లిపోతున్నారు. నేనొక్కత్తెనీ వాళ్లతో యాతనపడగలనా?"

"అదేమిటి రాణీ, వింగా మాట్లాడతావు? ఇటువంటి మనుషులతో మెలగటం నీకు కొత్తా?"

రాణిముఖం పాలిపోయింది. బాధతో మనసు చివుక్కుమంది. ఎల్లాగో సంబాళించుకొని "నాకు కొత్తకాదులెండి. కాని ఇటువంటి తాగుబోతుల్ని నా ఇంట్లో దిగవిడిచి వెళ్లిపోయే పెద్దమనుషులు నాకు ఎంతెంత డబ్బిస్తారో తెలుసా? నువ్వేం ఇవ్వగలవు? వాళ్ల కారుడ్రైవర్ల కున్న తాహతుకూడా నీకు లేదుమరి" అని హేళనగా అంది.

అశోక్ కోపంతో పళ్లు పటపట కొరుకుతూ రాణికేసి చూపులతో నిప్పులు చెరుగుతూ "అయితే దీనికి మామూ లెంతో చెప్పరాదూ? ఇప్పుడే పారేస్తాను" అన్నాడు.

తను అంత దురుసుగా మాట్లాడినందుకు రాణిమనసులో నొచ్చుకుంది. అశోక్ చేతి వేళ్లని తన చేతుల్తో నిమురుతూ లాలనగా "ఎందుకండీ అంతకోపం!" అంది.

ఆరాత్రికి విలాస్, అమల్ అక్కడే వుండేట్లుగా పరిష్కారం అయిపోయింది. అశోక్ ఇంటిదారి పట్టాడు.

ఇంటికి వెళ్లే సరికిబాగా పొద్దుపోయింది. జబ్బుగావున్న అతని భార్య ముఖం గోడవైపుకి తిప్పుకుని పడుకునేవుంది. అతని ముసలి తల్లి కునికిపాట్లుపడుతూ ఆవలిస్తూ రోగి మంచందగ్గర కూచునివుంది.

అశోక్ బూట్ల టకటకలు విని తల్లి ఉలిక్కిపడి లేచి "ష్, మెల్లిగా రా. శోభ ఇప్పుడే కళ్లు మూసుకుంది" అని హెచ్చరించింది.

శోభ గాఢనిద్ర పోతున్నట్లు కనిపించింది. అశోక్ ఇంట్లోకి వెళ్లి గబగబా భోజనం ముగించి వచ్చి చూసేసరికి శోభ పక్కమీద లేచి కూచుని నవ్వుతూ కనిపించింది.

"ఇదేమిటి? నువ్వు నిద్రపోవటంలేదా?" అని ఆశ్చర్యంగా అడిగాడు అశోక్.

శోభ బదులుచెప్పకుండా పకపకా నవ్వింది. ఆమెబుజాలని చేత్తో నిమురుతూ "ఏమిటి? డాక్టరు ఏం చెప్పా డివాళ?" అని అడిగాడు.

"ఏం చెబుతా డాయన? సగ్గుజావా బార్లీనీళ్లూ క్వైనామందూ తాగుతూ అస్తమానం పడుకునివుండమన్నాడు. ఆయనసొమ్మేం పోయింది? ఎన్నాళ్లయినా పడుకోమంటాడు." అంది శోభ.

సుస్తీతో నీరసించిన శోభముఖంకేసి రెప్పవాల్చకుండా చూస్తూ అశోక్ పక్కమీద కూచున్నాడు. ఆ చూపుకి శోభ సిగ్గుతో తలవంచుకుని "మీ రేం చేశారో గుర్తుందా?" అంది.

అశోక్ ఖంగారుపడి "ఏమిటి? నే నేం చేశానూ?" అన్నాడు.

"మరిచిపోయారుకాబోలు. కిందటిసారి మీకు సుస్తీచేసినప్పుడు ఇంట్లో మాకెవ్వరికీ నిద్రాహారా ల్లేవు. పాటలూ, పద్యాలూ, నవ్వులూ, శోకాలూ, అందర్నీ తారెత్తించేశారు వారంరోజులు" అని శోభ గుర్తుచేసేసరికి అశోక్ బిగ్గరంగా నవ్వాడు.

ఇంతలో ఏదో ఊరేగింపుసందడి వినిపించింది. సన్నాయిపాట బ్యాండుమోతలో అణిగిపోతోంది. "ఇటే వస్తున్నట్లుగా వుందే వూరేగింపు" అంది శోభ.

"వస్తోందికాని నువ్వుమాత్రం కదలటానికి వీల్లేదు. ఇంత నీరసంతో ఊరేగింపు చూడకపోతే మునిగిపోయిందా ?" అన్నాడు అశోక్.

"కాదండీ. ఒక్క నిమిషంసేపేగా. అంతగా నీరసంవొచ్చి నిల్చోలేకపోతే మిమ్మల్ని ఆనుకుంటూనుంటానులెండి" అని బతిమాలింది.

ఇంతగా అడుగుతుంటే కాదనలేకపోయాడు అశోక్. ఇద్దరూ వసారాలోకి వెళ్లి నిలబడ్డారు. వీధిఅంతా లైట్ల కాంతితోనూ వాద్యాల మోతతోనూ నిండిపోయింది. ఇంటిముందుగా వూరేగింపు వెళ్లిపోయింది. "ఇక పద లోపలికి" అన్నాడు అశోక్. లంఖణాలవల్ల నీరసించిపోయిన శోభ ఈ కాస్తకదలికకే అలసిపోయి ఒక చేతిని భర్తబుజాన మోపి ఆసరాచేసుకుని మెల్లిగా లోపలికి నడిచివెళ్లింది. "అందుకే నేను కదలద్దన్నాను. చూశావా, ఎంత నీరసంగా వున్నావో" అని అశోక్ మందలించాడు.

తలకింద దిండు సరిచేసి శోభని పక్కమీద పడుకోబెట్టాడు. భర్త చేతిని తన చేతుల్లో గట్టిగా చుట్టేసి శోభ ఎంతసేపటికీ విడవలేకపోయింది. ఇంతటి దయగల భర్తని పొందగలిగినందుకు లోపల ఎంతో పొంగిపోయింది.

తన భర్తనిగురించి అందరిముందూ మాట్లాడటం శోభకి బాగా అలవాటు. ఎంత అలవాటంటే అదొక జబ్బు అనిపిస్తుంది!

రోజూ మధ్యాహ్నంపూట పిల్లయింటికి సుందరి కాలక్షేపంకోసం వస్తుంది. ఆవిడతో అస్తమానం శోభ తన భర్తనిగురించే కబుర్లు చెబుతుంది. సుందరికి ముప్పైఅయిదేళ్లు వుంటయ్. ముగ్గురుపిల్లల తల్లి. ఆమెభర్త చనిపోయి అయిదోయేడు.

ఎందుకు శోభా భర్తఅంటే అంత ప్రేమ నీకు? నిమిషంకూడా విడిచి వుండలేవేం?" అంటుంది సుందరి వెటకారంగా.

"తప్పా? నీ కేమైనా అసూయగా వుందా?" అని నవ్వుతూ శోభ చనువుగా బదులుచెబుతుంది.

"పిచ్చిదానా! ఈ ముసలిదానిమాటలు నీ కివాళ వెగటుగా వుండొచ్చు. కాని నీకే తెలిసివొస్తుందిలే" అంటుంది సుందరి. శోభముఖంలోంచి చిరునవ్వు మాయమై


## నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, విక్కాక, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును కాంతిని వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. శి. ఏ. & కంపెని.

పెరిదేపి—నెల్లూరు జిల్లా

బ్రాంచి: 7 సీను మొదలివీధి. మద్రాసు.

పోయి భయంతో పాలిపోయి "చెప్పు. దాచకుండా చెప్పు. తెలిసివచ్చే దేమిటో చెప్పు" అని సుందరిని గుచ్చిగుచ్చి అడుగుతుంది.

బెదురుతున్న శోభముంగురులని చేత్తో సవరిస్తూ "ఏం లేదే పిచ్చిపిల్లా! భర్తమీద అంత మమకారం పెంచుకోరాదు. మగవాళ్ల ప్రేమ పాదరసంలాంటిది. తెలిసిందా?" అంటుంది సుందరి.

ఇల్లా మాట్లాడుతుండగానే అశోక్ ఆఫీసు నుంచి తిరిగిరావటం అతని అడుగుల అలికిడి వినగానే శోభ అక్కణ్ణుంచి పరుగుతీయటం భర్త కళ్లపడగానే ఇందాకటి మాటలన్నీ మరిచిపోవటం జరుగుతుంది. నవ్వుకుంటూ సుందరి చీరెకొంగు పరుచుకుని నిద్రకి ఉపక్రమిస్తుంది.

"అంత మంచి కబురు మానేసి ఎందుకు వచ్చావ్ శోభా?" అని అడుగుతాడు అశోక్. "నా యిష్టం!" అంటుది శోభ భర్తగోటు గుండీలు విప్పుతూ.

ఈవిధంగా సుందరి రోజూ మధ్యాహ్నం వేళ ఇక్కడే మకాం వేస్తుంది. శోభకి జ్వరంరావటంవల్ల ఆవిడకి కాలక్షేపంలేక తిక్కగా వుంది. ఇవాళ వొస్తూనే శోభ ఏదో నవల చదువుకుంటూవుండటం చూసి "అయితే ఇవాళ జ్వరం రానట్లేగా?" అంది.

"రాకేం వొచ్చింది. వొళ్లు పేలిపోతోంది. సంధికూడా వుడుతుంది" అని శోభ కోపంగా బదులు పలికింది. ఆనాడు అందరూ అదే ప్రశ్న అడగటంవల్ల శోభ విసిగిపోయింది.

సుందరి అంతటితో వూరుకోక శోభనుదుటిమీద చెయ్యివేసి చూసి "అబ్బే జ్వరం లేదు ఏమీలేదు" అని నవ్వుతూ పక్కనే వున్న మంచంమీద చతికిలపడి ఒక దిండు లాక్కుని వొళ్ళొ వాలుస్తూ "ఇదుగో నమ్మాయ్, మీ ఆయన పక్కమీద పడుకుంటున్నాను. నీకు అసూయ కలగదుకదా?" అని చిరునవ్వుతో అంది. ఈమాట వినగానే శోభ కోపం ఎగిరిపోయింది. పసిపిల్లలాగా పకపక నవ్వుతూ "పట్టపగలు పడుకుంటే ఏం లాభమమ్మా?" అంది.

"ఓహో అల్లాగా. అర్ధరాత్రే వచ్చి పడుకుంటా ననుకో. అప్పుడు నువ్వేం చేస్తావో చెపుదూ?" అని సుందరి సరసాన్ని ఇంకొంచెం ముందుకి నడిపింది.

"అయితే నీమీద నాకు అసూయ ఎందుకుండదూ?" అంది శోభ.

"మరేం భయం లేదులే శోభా! నేను నిజంగా రాకూడన్నానా?"

"బలేబాగుంది. అయితే నాకుమటుకు నీమీద నిజంగా అసూయవేసిందను కున్నావా?"

"కాదమ్మా శోభా. నిజంగా నాకు అటువంటి దురుద్దేశం లేదు. ఒకమనిషిమూలాన నేను ఎన్నిపాట్లు పడ్డానో చెప్పలేను. ఇంకోసారి ఆడజన్మ ఎత్తే దురదృష్టం కలిగినా పెళ్లిమటుకు వొద్దు బాబూ అని దేవుణ్ణి వేడుకుంటున్నాను" అంది సుందరి సరసాన్ని విషాదంలోకి దించుతూ.

శోభ గభాలున లేచి కూచుని సుందరి కేసి చురచురా చూస్తూ "అయితే యేమిటి నువ్వంటున్న మాటలు? నీభర్త పోవటమే నీకు సంతోషంగా వుందా?" అని పరుషంగా అడిగింది.

"నా మాటలు నీకు అర్థం కావులే శోభా. అర్థంకావలసిన అవసరంకూడా నీకు కలగకూడదని కోరుకుంటున్నాను" అని సుందరి గంభీరంగా అంది.

తరవాత ఆనాటి సంభాషణ స్తంభించి పోయింది. ఇద్దరూ ఒకరికేసి ఒకరు చూసుకుంటూ ఎవరి ఆలోచనల్లో వాళ్లు మునిగిపోయి కూచున్నారు. చాలాసే పున్నాక సుందరి దీర్ఘంగా నిట్టూర్పు విడిచి వెళ్లి పోయింది. సుందరి వెళ్తుంటే మంచిది వెళ్లిరా అని మర్యాదగా సాగనంపటానికూడా శోభకి నోట మాటాడలేదు.

ఆఫీసునుంచి భర్త తిరిగి రాగానే శోభ "సుందరిభర్త ఎల్లాటివాడు? బాగా బాధలు పెట్టేవాడా?" అని అడిగింది.

"అవును" అన్నాడు అశోక్ త్వరగా బూట్లు విప్పుకుంటూ.

అశోక్ తన ప్రశ్నని చులకనచేస్తున్నందుకు శోభ బాధపడుతూ "కాదండీ, నిజం చెప్పండి. వేళాకోళానికి నేను అడగటం లేదు" అంది.

"నిజమా? నిజమే చెప్పానుగా. ఎందుకు నీకు అనుమానం? సుందరి వీపు మీద ఇంకా భర్తకొట్టిన దెబ్బల ఆనవాలు పోలేదా యేమిటి?" అని చిరునవ్వుతో అడిగాడు.

ఛా, వూరుకుందురూ, ఎవరైనా వింటే నవ్విపోతారు. ఎక్కడైనా గౌరవం కల మగాళ్లు పెళ్లాల్ని కొడతార్టాయేమిటి?"

"ఓహో అల్లాగా? బుగ్గలుమటుకే పిండుతారు కాబోలు!"

"ఊరుకోండి. ఇది వేళాకోళం కాదు నిజం చెప్పండి. ఇవాళ ఆవిడ తన భర్తవల్ల చాలా బాధలు పడ్డట్లు చెప్పింది. నిజమేనా?" అని గంభీరంగా అడిగింది శోభ.

భార్యగాంభీర్యానికి అశోక్ నవ్వుకుని తనూ చివరికి గంభీరంగా "అవును నిజమే. ఆవిడ భర్త మంచిమనిషి కాదు" అన్నాడు.

శోభ ఆవేశంతో ఉత్తేజితురాలై పోయి "నిజంగానా? చెడ్డవాడా?" అని అడిగింది.

"అవును. అంతా చెడ్డవాడనే అనేవాళ్లు" అన్నాడు అశోక్.

"అల్లాగా. అయితే సుందరి ఎంత మంచి మనిషి! నేనయితేనా అటువంటి మనిషితో ఒక్కక్షణంకూడా కాపురం చెయ్యలేను. సుందరి కాబట్టి సర్దుకుంది. నేనైతేనా ఏం చేసేదాన్నో?"

"ఏం చేసేదానివో కొంచెం చెబుదూ" అన్నాడు అశోక్ కొంటెగా నవ్వుతూ.

"నేనయితే—" అని ఏదో అనబోయి శోభ మధ్యలోనే ఆగిపోయింది. తనే ఆపరిస్థితిలో వుంటే ఏం చేసేదో తెలియదు. బెదురుతూ భర్తగుండెల్లో తల దాచుకుని "అయినా మీరు అల్లాంటివారు కారుగా?" అంది.

ఈ అమాయకవిశ్వాసానికి అశోక్ మనస్సు కరిగిపోయింది.

"నీకు ఎల్లా తెలుసును? నేను ఎల్లాంటి వాడినని?" అని అశోక్ అడిగాడు.

"ఆడదానికి అంతమాత్రం తెలియదా? బంగారమేదో కాకిబంగారమేదో ఇట్టే తెలిసిపోదుటండీ!" అంది శోభ గర్వంగా.

ఈ మాటలు అశోక్ గుండెల్లో ములుకుల్లాగా గుచ్చుకున్నయ్. పైకి మటుకు "అయితే నీ కెందు కీవిచారం? వెళ్లి టీ తెచ్చిపెట్టు శోభా!" అన్నాడు.

"ఎంత పొరబాటు చేశాను. ఇవాళ టీ తయారు చెయ్యటం మరచిపోయాను......" అని నొచ్చుకుంటూ గబగబా టీ కలిపి తీసుకు వచ్చి భర్తకి అందించి "ఇవాళ సాయంకాలం ఎక్కడికైనా వెళ్తున్నారా?" అని అడిగింది. అశోక్ ఆశ్చర్యంతో "దేనికి?" అని అడిగాడు. తను ఎందుకు అల్లా అడిగిందో శోభ చెప్పలేకపోయింది. మునివేళ్లతో చీరెకొంగుచివరలని మెలివేస్తూ తల వంచుకుని నిలబడింది. అశోక్—

"అయితే ఇవాళ ఎక్కడికీ వెళ్లనులే" అన్నాడు.

(37 వ పేజీ చూడుడు)

# సూటి ప్రశ్న

(21-వ పేజీ తరువాయి)

అనుకోకుండా శోభకళ్లలో ఆనందాశ్రువులు తొణికినయ్.

వెళ్లనని అన్నప్పటికీ ఆనాడు అశోక్ తప్పకుండా బైటికి వెళ్లవలసినపని వుంది. నిన్ననే రాణి చాలా కటువుగా వుత్తరం రాసింది. ఆఫీసునుంచి అశోక్ సరాసరి తన దగ్గరికి రాకపోతే ఆత్మహత్య చేసుకుంటాననికూడా రాసింది. ఆఫీసునుంచే సూటిగా రాణిదగ్గరికి పోకుండా అశోక్ ఇంటికి వెళ్లి అక్కడినించి వెళ్దామనుకుని వచ్చాడు. కాని ఇంటిదగ్గర అనుకోకుండా ఈ ప్రతిబంధకం వచ్చిపడింది. ఎక్కడికీ వెళ్లనని శోభకి మాట యిచ్చాడు. కాని వెళ్లకపోతే ఎల్లాగు?

ఎన్నాళ్లనుంచో నేను నీదాన్ని అని దీనంగా రాణి వుత్తరంలో విన్నవించింది. మునుపు ఆఫీసులో వున్నంతసేపూ అశోక్ ప్రాణానికి ముళ్లమీద వున్నట్లుంటేది. ఎప్పుడు వెళ్లి రాణిదగ్గర వాలుదామా అని కొట్టుకుపోయేవాడు. అటువంటివాడు రోజులతరబడి రాణికి ముఖమైనా చూపించకుండా కాలం గడుపుతున్నాడు. వారానికొకసారి దర్శనం ఇవ్వటానికైనా తనకి తీరిక లేదంటాడు. ఇదంతా తన దురదృష్టమని రాణి వుత్తరంలో వాపోయింది.


గడిచినరోజుల సంగతులతో ఆరుతావుల వుత్తరం మధురంగా దీనంగా రాసి చివరికి ఇల్లా ముగించింది. "మీకు గడిచిపోయిన మధురస్మృతులు గుర్తుచేసి లాభంలేదని నాకు తెలుసును. కాని రాయకుండా వుండటం నాకు చేతకాలేదు. కాని ఒక్క ప్రశ్నమటుకు మిమ్మల్ని అడగదలుచుకున్నాను. నా మనసు మీ వశమైనంతమాత్రాన నన్ను ఇల్లా బాధలపాలుచేయ్యటం మీకు భావ్యమేనా చెప్పండి? రేపు నా పుట్టిన రోజు. రెండు నిమిషాలసేపయినా సరే మీరు వచ్చి వెళ్లండి. ఇంతమాత్రాన మీ శీలానికి కళంకం అంటుకోదనుకుంటాను."

ఉత్తరంలో సూదుల్లాగా గుచ్చుకునే సూటిపోటిమాటలు చాలా వున్నయ్. అదీకాక అశోక్ కూడా వెళ్లాలనే గట్టిగా అనుకున్నాడు. కాని తనని ఇంతగా నమ్ముకున్న శోభని నొప్పించి వెళ్లటానికి అతనికి మనసొప్పటం లేదు. ఎటూ తెగని సందిగ్ధావస్థలో పడ్డాడు అశోక్.

అదేసమయానికి అతని మిత్రులు అమల్, విలాన్ ఇద్దరూ వచ్చి వాకిట్లోంచి బిగ్గరగా కేకలుపెట్టారు. "కూచోండి, ఇప్పుడే వొస్తున్నాను" అని అశోక్ లోపల్నుంచి కేక వేశాడు.

బైటికివస్తూనే "ఏం పనిమీద వచ్చారు?" అని అశోక్ వాళ్ళని సూటిగా అడిగాడు.

"ఏమిటోయ్ అంత కోపం మీద వున్నావేం?" అన్నాడు అమల్. "నువ్వూరుకోవోయ్. నేను మాట్లాడుతానుగా"



ఆస్ట్రేలియా విదేశాంగమంత్రి పి. సి. స్పెండర్ ఇటీవల భారతరాజధానిలో మూడురోజులు ఉన్నారు. వారు రాజఘాట్‌కు వెళ్లి గాంధీజీ సమాధిని దర్శించారు.

అన్నాడు విలాస్. అమల్ మొరటుమనిషి కనక బిగ్గరగా "ఏముందోయ్ నువ్వు మాట్లాడేది? నేనే చెబుతాను. నాయనా అశోక్, రాణి నీకోసం బెంగపెట్టుకుంది. నిన్ను నిలుచున్నపాళాన వెంటపెట్టుకుని రమ్మని మమ్మల్ని పంపింది. త్వరగా బట్టలు వేసుకుని మంచికుర్రాడిలాగా మాతో బయలుదేరు. లేకపోతే నిన్ను ఎల్లాగో కాళ్లూచేతులూ కట్టేసిఅయినా లాక్కుని పోతాం తెలిసిందా?"

"ఇవాళ వీలులేదు. రేపు వస్తానని చెప్పండి పోండి" అన్నాడు అశోక్ చికాకుగా.

ఇవాళ నువ్వు వచ్చితీరాలి. రాకపోతే నిన్ను వదలిపెట్టం జాగ్రత్త" అని అమల్ అరిచాడు.

అశోక్ తలవూపుతూ ఇవాళ రావటానికి వీల్లేదన్నాడు.

"నీయిష్టం వుంటే రా, లేకపోతే లేదు. మరేం బలవంతం లేదు. ఒక్కమాటమాత్రం విను. నీకోసం కలవరిస్తూ అన్నం నీళ్లూ లేక రాణి ఆనవాలుపట్టలేకుండా మారిపోయింది. ఇప్పటికైనా రావాలనిపిస్తే రా. లేకపోతే మానుకో. అదంతా నీయిష్టం." అని విలాస్ కరుకుగా అన్నాడు.

ఎటూ నిశ్చయించుకోలేక అశోక్ మనస్సులో బాధపడుతున్నాడు. ఈ మౌనానికి విసిగిపోయి అమల్ "వస్తావా రావా? ఒక్క మాట తేల్చి చెప్పు బాబూ" అని బిగ్గరగా అరిచాడు.

"కొంచెం మెల్లిగా మాట్లాడు"అంటూ అశోక్ వేలితో మేడమీదగదివేపు చూపించాడు. ఈ మాటలు భార్య ఎక్కడ వింటుందో అని అశోక్ భయపడుతున్నాడు.

అమల్ పకపక నవ్వుతూ "వింటే మునిగిపోయిందేమిటి? మా ఆవిడకి అంతా తెలుసు. నేనే చెప్పేశాను తెలుసునా" అన్నాడు.

"ఘనకార్యం చేశావులేవూరుకో" అన్నాడు అశోక్ చికాకుగా. "అయితే నువ్వు రానట్లేగా? మమ్మల్ని వెళ్లిపొమ్మంటావా?" అని విలాస్ కోపంగా అడిగాడు.

అశోక్ అంతులేని ఆలోచనల్లోపడ్డాడు. మాటిమాటికీ శోభఅమాయకమైన కళ్ళూ అందమైన ముఖమూ మనసులో మెరసిపోతున్నయ్. చాలాసేపు మౌనంలో ఉక్కిరిబిక్కిరై చివరికి "ఏమైనాసరే నేనివాళ రాను. రేపు తప్పకుండా వస్తాను." అన్నాడు.

స్నేహితులిద్దరూ వెళ్లిపోయారు. అశోక్ మట్టుకు శోభగదిలోకి పోలేక పోయాడు. తన గదిలోకి వెళ్ళి పడకకుర్చీలో వాలి చేతికందిన పుస్తకమేదో తీసుకుని పేజీలు తిరగేస్తూ కూచున్నాడు.

మిత్రుల సంభాషణలో ప్రతిఅక్షరమూ శోభచెవుల్లో పడింది. అమల్ నవ్వూ, విలాస్ కటుస్వరమూ, భర్తసంకోచమూ, భయమూ, అన్నీ కలిసి శోభమనస్సుని విరిచివేసినయ్. పిడుగుదెబ్బ తిన్నట్లుగా శోభ నిర్జీవ ప్రతిమమాదిరిగా నిలబడిపోయింది. తన భర్తనుగురించిన సత్యం ఇంత అనుకోకుండా బైటపడి శోభని తలకిందులు చేసింది.

క్షణంలో శోభగతజీవితమంతా మిథ్యగ వంచనగా గాలిలో తేలిపోయింది. ఆమె కుటుంబజీవనంలోని సౌఖ్యం నీటిబుడగలాగా పేలిపోయింది. ఆమెభావిస్వప్నాలన్నీ పేకమేడల్లాగా కూలిపోయినయ్.

ఆక్షణంనుంచీ శోభ భర్తకంట పడకుండా ఇంట్లో నక్కుతూ తిరగటం మొదలుపెట్టింది. ఆమెధీమా అంతా అణగారిపోయింది. మర్నాడు ఎవరిముఖమూ చూడలేనంత సిగ్గుతో మగ్గిపోయింది. రాత్రిపూట భర్త గదిలోకి రాకముందే నిద్రపోయినట్లు నటించి అశోక్ ఎంతలేపినా కళ్లు తెరవలేదు.

మర్నాడు సుందరి మామూలుగా వచ్చి శోభ కనబడకపోవటంవల్ల తనదారిన తాను కాస్సేపు కునుకుతీసి వచ్చినదారినే వెళ్ళిపోయింది.

మధ్యాహ్నం భర్త ఆఫీసునుంచి ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూస్తూ కూచుంది శోభ.

ఆఫీసునుంచి వస్తూనే "ఏం నిద్ర పూర్తి అయిందా?" అని అశోక్ హేళనగా అన్నాడు.

"నేను నిద్రపోలేదే" అంది శోభ నవ్వుతూ.

"ఇప్పటి సంగతి కాదు. నిన్నటి రాత్రి మాట" అంటూ అశోక్ శోభబుజాలమీద చేతులు వేశాడు. తప్పించుకుని దూరంగా వెళ్ళి "నిన్నరాత్రి ఎందుకో వొళ్లెరగనంత నిద్రపట్టింది" అంది.

"వొంట్లో సుస్తీగా లేదుకదా?" అని ఆందోళనతో అడిగాడు అశోక్,

దీనికి బదులు చెప్పకుండా "వుండండి, టీ తెచ్చిస్తాను" అని లోపలికి వెళ్ళి కప్పులో


ఉబ్బసపు రోగమునకు



శాస్త్రయుక్తమైన చికిత్స

ఉబ్బసపురోగము చిటికలతోనూ మంత్రములతోనూతదితర విధములైన ఔషధములతోనూ అప్పటికప్పుడు తగ్గినట్లు కనిపించినా ఈ మందులవలన అది దీర్ఘరోగముగామారుట తప్ప ఏమియు లాభము లేదు.

**పురోహిత శ్వాసహారి** అనేక సంవత్సరములుగా వైద్య శాస్త్రమునకు తెలిసినదే. ఉబ్బసమునకు సరియైన శాస్త్రయుక్తమైన మందు యిదే అని అందరికీ తెలిసినదే. చక్కగా జీర్ణం అవుతుంది. క్రమక్రమంగా ఆరోగ్యం చేకూరుతుంది. ఊపిరితిత్తులు బలపడుతవి. ఉబ్బసం శాశ్వతంగ నివారణమగును. మంచి కెమిస్టు లందరివద్ద 3.టా 6. టా.12. టా. ల సీసాలలో రు. 3/8.రు 6/-. 10/- లకు దొరకును. లేదా డాక్టర్ పురోహిత్ ఫార్మసీ కొల్హాపూర్, యస్. యమ్. సి. గారికి వ్రాయుడు.



పురోహిత శ్వాసహారి

మద్రాసు స్టాకిస్టులు: అప్పా అండ్ కో. చైనాబజారు (2) జే. బాలాభాయ్ అండ్ కో. 260 చైనాబజారురోడు. (3) దాదా అండ్ కంపెనీ. నైనియప్ప నాయకణ్ వీధి; రాజమండ్రీ, ఈశ్వర్ దాస్ అండ్ కో. బెజవాడ. బెజవాడ మెడికల్ స్టోర్సు; విశాఖపట్నం; వైజాగ్ మెడికల్ స్టోర్సు; సికింద్రాబాద్. పండలిక్ అండ్ కో. సుబ్రిక్ వీధి; నెల్లూరు. ఏ. ఆర్. గోపాల్ బ్రదర్సు. ట్రంకురోడు; ఒంగోలు. ధన్వంతరి మెడికల్ స్టోర్సు. గుంటూరు. మెడికల్ అండ్ ఆప్టికల్ ఎంపోరియం; గుడివాడ. గుడివాడ మెడికల్ స్టోర్సు; ఏలూరు. రావు మెడికల్ స్టోర్సు; కాకినాడ, లక్ష్మీనారాయణ అండ్ కో; మచిలీపట్నం, మెడికల్ స్టోర్సు.

పోసి తెచ్చియిచ్చి "ఇప్పుడెక్కడికయినా వెళ్తున్నారా ?" అని అడిగింది.

కొంచెంసేపు తటపటాయించి "అవును. వెళ్లాలి. చాలా అవసరమైన పని వుంది" అన్నాడు. ఇవాళకూడా శోభ వుండమంటుందేమో నని భయపడి ముందుజాగ్రత్త కోసం "త్వరగా వచ్చేస్తానులే. ఎక్కువసేపు పట్టదు" అన్నాడు.

అశోక్ తొందరగా వెళ్ళిపోబోతుంటే శోభ చివాలున లేచి "ఇదేమిటి ఇల్లా వెళ్తారా బట్టలు మార్చుకోరా ? "అని అడిగింది.

"ఫరవాలేదు. ఎల్లా వెళ్తేనేం ?" అన్నాడు అశోక్ నవ్వుతూ.

అల్లా కాదని వారించి తన చేతుల్తో తనే అతనికి మంచి ప్రంచా, సిల్కులాల్చీ, జరీ వుత్తరీయం, పాలిష్‌చేసిన స్లిప్పర్లూ, సెంటు రాసిన జేబురుమాల తెచ్చియిచ్చి అలంకరించింది.

అప్పుడప్పుడూ షికారుకి వెళ్లేప్పుడు భర్తని ఈవిధంగా అలంకరించటం శోభకి అలవాటు. కాపరానికి వచ్చిన కొత్తలో రోజూ ఇల్లాగే భర్తని అలంకరించి బైటికి పంపేది. ఈమధ్య అలవాటు తప్పిపోయింది. కాని ఇవాళ మళ్ళీ మునుపటిమాదిరిగా తనని అలంకరించటంలో శోభఉద్దేశ మేమిటో తెలియక అశోక్ తికమకపడ్డాడు. అలంకారం పూర్తి అయేదాకా శోభ తల పైకెత్తలేదు. అంతా అయినాక "భోజనం చేసే వస్తారా ఇవాళ ?" అని అడిగింది.

"అదేమిటి అల్లా అడుగుతున్నావ్ ?" అన్నాడు అశోక్ బిత్తరపోతూ.

"అః. యేం లేదు. మీ స్నేహితులు ఇవాళ యెవరిదో పుట్టినరోజన్నారుకదూ. అందుకని అడుగుతున్నాను."

అశోక్‌ముఖాన కత్తివేసినా నెత్తురు చుక్క లేదు. కొరడాదెబ్బలాగా చురుక్కున తగిలింది. తప్పించుకునే వుపాయం దొరకలేదు. వెంట ఎవరైనా తరుముకు వస్తుంటే కొంతదూరంపారిపోయి, తప్పించుకునేదారి లేక గిరుక్కున వెనక్కి తిరిగే జంతువులాగా "అవును. అయితే యేమిటి ?" అని ధిక్కారంగా అడిగాడు.

శోభ మెదలకుండా అతనికేసి చూస్తూ నిలబడిపోయింది.

"ఎక్కడికి వెళ్ళినంతమాత్రాన నా శీలం పాడైపోదులే" అన్నాడు ధీమాగా అశోక్.

ఆ మాట వినేసరికి శోభకి నవ్వొచ్చింది. "ఇన్నాళ్లూ నన్ను మోసగించారు. ఇప్పుడైనా నిజం చెప్పండి. ఒక్కసారైనా నిజం పలకండి. మీకు నేనంటే యిష్టం లేదా ? చెప్పండి" అని అడిగింది.

భార్యముందు తన బండారమంతా బైట పడిందని అశోక కోపంతోనూ అభిమానంతోనూ రగిలిపోతున్నాడు. అప్రయత్నంగా కోపంతో "ఇష్టం లేదు" అనేమాట జారి వచ్చేసింది.

"ఎందుకని ఇష్టం లేదు ? నేనంటే మొహం మొత్తిందా మీకు ?" అని శోభ టువుగా సూటిగా అడిగింది. "నాలో ఆకర్షణ లేదా ?"

ఈ విషయాన్ని గురించి అశోక్ ఆలోచించనేలేదు. ఏం జవాబు చెప్పాలో తోచ లేదు. ఈమధ్యనే చదివిన ఒక నవలలోని వాక్యాలు కొన్ని స్ఫురించినయ్. అవి ఇల్లా అప్పజెప్పటం మొదలుపెట్టాడు "నేను కోరిన లక్షణాలు నీలో దొరకలేదు. నా స్వప్నాల్లో చూసిన ఆదర్శసుందరిని కనుగొంటేకాని నా తృష్ణ చల్లారదు. లోకంలో అందమైన స్త్రీల అందాలన్నిటినీ సేకరించి నిర్మిస్తేకాని నా స్వప్నసుందరిదర్శనం కాదు. ఈ దర్శనంకోసం నేను ఎందరుస్త్రీలని కలుసుకుంటే నీ కెందుకు ? నీ కేం నష్టం ? నేను నీ కేమైనా లోపం చేశానా ?"

"లేదులెండి. నాకు లోపం చేశారని నే నన్నానా ?" అంది శోభ. ఇంకొంచెం ధైర్యం తెచ్చుకుని "అయితే, ఎందుకు నీకు ?" అన్నాడు అశోక్.

"ఇవాళ నా చేతులతో అలంకరించి మిమ్మల్ని మీ ప్రియురాలిదగ్గరకి పంపిస్తున్నాను. నాకూ ఆదర్శపురుషుడిమీద తృష్ణ వుందనుకోండి. ఆ స్వప్నమూర్తిని వెతుకుతూ నేనూ వెళ్ళేటప్పుడు నన్ను మీచేతుల్తో ఇల్లా అలంకరించి పంపగలుగుతారా, చెప్పండి ?" అని శోభ గంభీరంగా అడిగింది.

ఈ అనకోని ప్రశ్నకి అశోక్ తట్టుకోలేక తారుమారైపోయి, బేజారెత్తిపోయి "ఏమిటీ ? నిన్ను అలంకరించి పంపాలా ?" అన్నాడు.

"అవును. ఇవాళ ఒకే కారులో ఇద్దరం పోతున్నామనుకోండి. ఆదర్శసుందరికోసం మీరూ, ఆదర్శసుందరుడికోసం నేనూ మీచోటికి మీరూ, నాచోటికి నేనూ పోతున్నామనుకోండి. నన్ను మీ చేత్తో అలంకరించి పంపరా మరి ?

"ఏమిటీ ఈ కారులోనే నువ్వు కూడానా ?"

"అయితేమటుకు ప్రమాద మేముందీ ?"

అశోక్ అర్థంకాని అయోమయంలో పడి శోభకేసి రెప్ప వాల్చకుండా చూస్తూ నిలబడిపోయాడు. కాళ్లకింద నేల అణగారిపోతున్నట్లనిపిస్తోంది !



భారతప్రధాని ఢిల్లీలో నేషనల్ స్పోర్ట్సు స్టేడియంకు శంఖుస్థాపన జరిపారు.